క్లుప్తంగా

రేపు ఆత్మీయ సమ్మేళనం



ఉండవెల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఈ నెల 24న ఆత్మీయ సమ్మేళనం సభ నిర్వహిస్తునట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అజయ్, వైస్ ఎంపీపీ దేవన్న పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థలాన్ని పరిశీలించి ప్రత్యేక ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకన్న, రాజశేఖర్, ఉప సర్పంచ్ సయ్యద్ రెహ్మాన్, మండల అధ్యక్షుడు రమణ, వెంకటేశ్ గౌడ్, లింగారెడ్డి, నరసింహ, కృష్ణ గౌడ్, పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌కు కూలిన ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వసతి గృహానికి ప్రహరీ కూలిపోవడంతో రాత్రివేళలో మందుబాబులు వసతిగృహం అడ్డాగా మారిందని మండల ప్రజలు వాపోయారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరయ్య ఉర్సు



రాజోళి: మండలంలోని పచ్చర్లలో వెలిసిన దస్తగిరయ్య, గోకారమయ్య ఉర్సు వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం ఉర్సు, శుక్రవారం కిస్తీ పోటీలతో పాటు కబడ్డీ, వాలీబాల్, బ్యాండ్ సెట్ పోటీలు, స్లోబైక్ రేస్ పోటీలు నిర్వహించనునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి దాతలు బహుమతులు అందజేస్తామని సర్పంచ్ తిరుమల్ రెడ్డి తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు కోరారు. ఆత్మకూర్ పట్టణంలో బుధవారం 213 బూత్‌లో ఉగాది సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిధులను వినియోగిస్తూ ప్రధాన మంత్రిపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. బీఆర్ఎస్ నాయకుల విమర్శలను కేంద్రం అందిస్తున్న పథకాలతో ప్రజలను చైతన్య పరిచి తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాగేందర్‌రెడ్డి, రేచింతల శ్రీనివాసులు, ఎదుల రాజు, హరీష్, అశోక్, మండ్ల సూరి, సాయి, రఘు, బాలస్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వర ఆలయానికి విరాళం



కొత్తకోట: మండలంలోని కానాయపల్లికి చెందిన బక్క తిరుపతి, సరోజ దంపతుల కుమారులు మల్లికార్జున, అయ్యప్ప, రేవంత్ స్థానికంగా ఉన్న కోటిలింగేశ్వర ఆలయానికి రూ.27,116లు విరాళం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా వారు విరాళాన్ని ఆలయ నిర్వాహకులు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో ప్రతిష్ఠించే 20 శివకోటి యంత్రాల ద్వారా పదకొండు వేల లింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి విరాళాలు సేకరిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. కాగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పారిజాతమ్మ, అర్చకులు పాలొన్నారు.



కేటీదొడ్డి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో జెండాలతో యువకులు



గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న మల్దకల్ వేదపండితులు

వైభవంగా ఉగాది సంబురాలు

జిల్లా వ్యాప్తంగా శోభకృత్ నామ తెలుగు సంవత్సర ఉగాది పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే లేచి ఇంటి ముంగిళ్లను అందంగా ముస్తాబు చేసి ముగ్గులు వేసి, మామిడి ఆకుల తోరణాలను కట్టారు. పిండి వంటలు, షడ్రుచుల పచ్చడిని భగవంతుడికి నైవేద్యంగా సమర్పించారు. అలంపూర్ క్షేత్రంలో బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ మండలాలలో క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు గ్రామాల్లో కాడెద్దుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి.ఆలయాల వద్ద పంచాంగ శ్రవణం వినిపించారు. గద్వాల పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని వేదపండితులు ఆశీర్వదించారు.

–సాక్షి, నెట్‌వర్క్



గట్టు మండలం మాచర్లలో పంచాంగ శ్రవణం వింటున్న గ్రామస్తులు



అయిజలో పంచాంగ శ్రవణానికి ఊరేగింపుగా వెళ్తున్న ప్రజలు



అయిజలో కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో..



ఉండవెల్లిలో చెన్నకేశవస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



మల్దకల్‌లోని అమరవాయిలో బండలాగుడు పోటీలలో పాల్గొన్న వృషభరాజాలు

గద్వాల: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు బీసీ కాలనీలో కౌన్సిలర్ జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలపళ్ల విభాగం జోడెద్దుల బండలాగుడు పోటీలను బుధవారం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వృషభ రాజాలు పోటీలలో తలపడ్డాయి. సాయంత్రం బల ప్రదర్శనలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, బీఆర్ఎస్ నాయకులు కోటేష్, గోవిందు, భగీరథవంశీ, అన్వర్, వీరేష్, కురుమన్న, రాజు, సీతరాములు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని అమరవాయిలో బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 9 మంది రైతులకు సంబంధించిన వృషభరాజాలు బండలాగుడు పోటీలలో పాల్గొన్నాయి. ఈ పోటీలలో మద్దిలేటికు చెందిన వృషభరాజాలు మొదటిస్థానంలో నిలిచి రూ.20వేలు, దౌలత్ వృషభ రాజాలు రెండో స్థానంలో నిలిచి రూ.15వేలు, మూడో స్థానంలో ఉప్పరి కృష్ణ వృషభరాజాలు రూ. 10వేలు, నాల్గో స్థానంలో వెంకటన్న వృషభరాజాలు రూ.6వేలు, నాగన్న వృషభలు ఐదో స్థానంలో నిలిచి రూ.5వేల బహుమతిని దక్కించుకున్నాయి. విజేతలకు గ్రామ నాయకులు, రైతులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచు పద్మమ్మ, ఎంపీటీసీ పెద్ద గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచు సరోజమ్మ, సాగర్‌రెడ్డి, తూం కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుర్వ లక్ష్మన్న, మద్దిలేటి, రాముడు, వీరేష్, రాజు, తిమ్మప్ప, నల్లన్న, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

గట్టు: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో వెలసిన తిక్కతాత రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, సర్పంచు శంకరమ్మ, ఎంపీటీసీ బొజ్జయ్య, రామకృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమాం సాబ్, మాజీ ఎంపీటీసీ వెంకటన్నగౌడ్, నాయకులు తిమ్మప్ప, మహ్మద్, ఖాజా, నారాయణ, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అనారోగ్యంపై మంత్రి కేటీఆర్‌కు ట్వీట్

రాజోళి: నారాయణ పేట జిల్లా బొమ్మన్‌పాడ్‌కు చెందిన బాలుడు నర్సింహులుకు కొన్నేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి చెందారు. బాలుడి గుండెకు రంధ్రం ఏర్పడి చికిత్స కోసం దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వివిధ పత్రికలలో, సోషల్ మీడియాలో కథనాలు ప్రచురితం అయ్యాయి. వీటిని రాజోళికి చెందిన యువకుడు గోవర్ధన్‌రెడ్డి బాలుడి ఆరోగ్య పరిస్థితిపై పత్రికల్లో వచ్చిన కథనాలను మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశాడు. దీనికి మంత్రి స్పందించి రూ.5లక్షలు, ఔషధాల కోసం రూ.50 వేలు అందజేశాడు. దీంతో బాలుడు గుండెకు ఆపరేషన్ చేసుకొని ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడు. దీంతో బాలుడి బంధువులు నారాయణపేట నుంచి రాజోళికి వచ్చి యువకుడు గోవర్ధన్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి

అయిజ: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉగాదిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని భరత్‌నగర్‌లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మొత్తం 20 టీంలు పోటీల్లో పాల్గొననున్నాయి. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 30వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్‌ఖన్నా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి నగదు అందజేత

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని లక్ష్మీదేవమ్మ అమ్మవారికి బంగారం కిరీటం నిమిత్తం పాగుంట గ్రామానికి చెందిన ఆలూర్ హనుమంతు, శంకరమ్మ దంపతులు రూ.42,216 ఆలయ నిర్వాహకులకు బుధవారం అందజేశారు. దాతలు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారిని శేషవస్త్రాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర్ రెడ్డి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పక్కా నిర్మాణాలపై పేదల దృష్టి

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలో గల సర్వే నంబర్ 547, 548లో గల పద్నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలకు కేటాయించిన స్థలాలు చూపాలని నిర్వహిస్తున్న గుడిసెల పోరు నేటికీ 196 రోజులు పూర్తి చేసుకుంది. సెప్టెంబర్ 6, 2022 నుంచి ప్రారంభమైన గుడిసెల పోరు నేటికీ కొనసాగుతుంది. గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చిన అధికారులు వాటికి తగిన స్థలాలు పొజిషన్ చూపాలంటూ లబ్ధిదారులు ఆందోళన నిర్వహిస్తున్నారు. గుడిసెల పోరుకు సీపీఎం మద్దతు ఇవ్వడంతో 430 మంది లబ్ధిదారులు తాత్కాలికంగా గుడిసెలను నిర్మించుకొని అక్కడే జీవిస్తున్నారు. ఒకొక్కరు రూ.10 నుంచి రూ.15 వేలు ఖర్చుచేసి తడికలతో గుడిసెలను నిర్మించుకున్నారు. వారం రోజుల కిందట గాలి, వానకు గుడిసెల తడికలు కూలడంతో ఇక పక్క నిర్మాణాలపై దృష్టి సారిస్తున్నారు. జీఓ నంబర్ 58, 54 ప్రకారం ఎవరైనా ప్రభుత్వ భూమిలో నిరుపేదలు ఇంటి స్థలాల కోసం కబ్జాలో ఉంటారో వారికే అవి చెల్లుతాయన్న ఆదేశాలతో మొక్కవోని ధైర్యంతో లబ్ధిదారులు ఆందోళనలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఈదురు గాలులకు దుంపాయికుంటలో గుడిసెలు

రాజ్యాధికారంతోనే న్యాయం



దోలు కొడుతున్న గొంగళ్ల రంజిత్ కుమార్

ధరూరు: రాజ్యాధికారంతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ఆత్మగౌరవ పాదయాత్ర బుధవారం నాటికి 6వ రోజుకు చేరింది. మండలంలోని ఉప్పేరు, గుడ్డెందొడ్డి, వామన్‌పల్లి, నర్సన్‌దొడ్డి, చింతరేవుల, జూరాల, రేవులపల్లి, పెద్ద చింతరేవుల గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. బహుజనులను చైతన్యం చేయడంతో పాటు పాలకుల వైఫల్యాలను ఎండగట్టడమే పాదయాత్ర లక్ష్యమన్నారు. నిరక్షరాస్యత వల్ల గ్రామీణులు వెనుకబాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు గోవిందు, తిమ్మప్ప, రంగస్వామి, ఏసన్న, ఉపేంద్ర, రాము, విష్ణు, ప్రేమ్‌రాజ్, భీమన్‌గౌడ్, అంజి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



రాజోళి: మండలంలోని పచ్చర్లలో ఆనంద్‌రెడ్డి, రామలింగమ్మల జ్ఞాపకార్థం అచోలు బ్రదర్స్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు, కూలీలకు దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు మజ్జిగను అందించారు.

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడులో బుధవారం భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఐటీ సెల్ కానిస్టేబుల్ రమేష్ ఆచారి ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు నరసింహులు, సురేష్, భాస్కర్, ఉపాధ్యాయులు వెంకటేష్, పరశురామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాలలు



కూలేందుకు సిద్ధంగా ఉన్న మానవపాడు ప్రాథమిక పాఠశాల

- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మానవపాడు: ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎన్ని చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు ఎక్కడివేసిన గొంగళి అక్కడే చందంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. చదువుకునేందుకు బడికి వెళ్లాలంటే వెనకడుగు వేస్తున్నారు. పాఠశాల భవనాలు శిథిలావస్థలకు చేరుకోవడంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. తరగతిగదులలో ఎప్పుడు పెచ్చులు ఊడిపడుతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే లేడని విద్యార్థులే తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యారంగానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. చాలా పాఠశాలల్లో బిక్కు బిక్కు మంటూ చదువులు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.


వివరాలు ఇలా..

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 03, ప్రాథమికోన్నత పాఠశాలలు 07, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 12 ఉన్నాయి. మొత్తం పాఠశాలలో 3981 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం బడుల నిర్మాణాలు చేపట్టేందుకు మన ఊరు–మనబడి పథకం ద్వారా వసతుల కల్పన, కొత్త గదులు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా మండలంలో 7 పాఠశాలలు ఎంపిక చేశారు. మన ఊరు–మనబడి నిర్మాణాలు చాలా చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పైకప్పు ఎప్పుడు ఊడిపడుతుందోనని భయాందోళనగా ఉన్నారు. ఉపాధ్యాయులు సైతం ప్రార్థన సమయంలో స్టేజీపై నిలబడాలంటే జంకుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో మూడు గదులు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా మండలంలోని కొన్ని పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు లేక పందులు పాఠశాలలోకి ప్రవేశించి విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. చాలా పాఠశాలల్లో సరైనా తాగునీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్ల సమస్య శుభ్రంగా లేకపోవడం, క్రీడా ప్రాంగణాలు లేక విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


త్వరలోనే పనులు పూర్తి చేస్తాం

మండలంలో కొన్ని పాఠశాలలో మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పనులు ప్రారంభించాం. మానవపాడులో ప్రహరీ నిర్మాణాలను చేపడుతున్నాం. మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే ఏడాది నాటికి సమస్యలు లేకుండా చూస్తాం.

– శివప్రసాద్, ఎంఈఓ



జెడ్పీహెచ్‌ఎస్‌లో నెర్రెలుబారిన గోడలు



ప్రాథమిక పాఠశాలలో గోడలకు పగుళ్లు

5న చలో పార్లమెంట్



ఉండవెల్లి: ఉపాధి కూలీలు, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 5న చలో పార్లమెంట్ కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయ ఆవరణలో చలో పార్లమెంట్ సంబంధించిన కరపత్రాన్ని హమాలీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఉపాధి కూలీల పని దినాలను 200 రోజులకు పెంచాలని, పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, రైతు రుణమాఫీ ఒకేసారి అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో పార్లమెంట్‌కు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు వెంకట్రాముడు, కార్మికులు శివకుమార్, నరసింహ, పెద్దయ్య, శ్రీను, నరసింహ, రామాంజనేయులు, అశోక్, రఘు, లక్ష్మణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి రథం ఊరేగింపు

అయిజ: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మండలంలోని తాటికుంట చెందిన గోపాల్ గౌడ్ రూ.4 లక్షల వ్యయంతో రాములోరికి రథం చేయించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని నూతనంగా తయారు చేసిన రథాన్ని భక్తులు బుధవారం మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య పట్టణం నుంచి మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి తీసుకెళ్లారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అయిజలో రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు